ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం

- సౌత్‌వెస్ట్ జోన్ నూతన డీసీపీ కిరణ్ ఖరే
- నూతన జోన్ పరిధిలో పర్యటించిన డీసీపీ
- గంజాయి నిర్మూలన కోసం స్పెషల్ టీం ఏర్పాటు చేస్తామని వెల్లడి
- నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక
- ప్రజలకు నిరంతరం రక్షణ కల్పిస్తామని హామీ


డీసీపీ కిరణ్ ఖరే

అబిడ్స్: గంజాయిని పూర్తిగా నివారించేందుకు స్పెషల్ టీమ్ ఏర్పాటు చేస్తున్నట్లు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. నూతన జోన్ డీసీపీగా కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీసీపీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి, సట్టాను పూర్తిగా నివారించేందుకు ఓ పోలీసు అధికారి నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ప్రతిరోజూ తనిఖీలు చేపడతామన్నారు. గంజాయి విక్రయించినట్లు, కొనుగోలు చేసినట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయదారులపై గతంలో పలుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు.

ప్రజలు ఐక్యతతో మెలగాలి..

జోన్ పరిధిలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో మెలగాలని డీసీపీ కిరణ్ ఖరే సూచించారు. ఎవరైనా మత ఘర్షణలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. ప్రజలకు రక్షణగా ఉంటూ వారికి అన్నివిధాలా సహకారం అందిస్తామని ఆయన అన్నారు.

త్వరలో రెండు పోలీస్‌స్టేషన్లు..

నూతనంగా ఏర్పడిన సౌత్‌వెస్ట్ జోన్‌లో త్వరలోనే రెండు కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు డీసీపీ కిరణ్ ఖరే తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గుడిమాల్కాపూర్, టోలీచౌకి పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతన స్టేషన్ల ఏర్పాటుతో స్థానికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. నూతనంగా కుల్సుంపురా పోలీస్ డివిజన్, గోల్కొండ పోలీస్ డివిజన్లను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం..

కొత్త జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్తీ సంఘాలతో తరచూ మైత్రి సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు, పోలీసుల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తూ సంఘ విద్రోహుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని డీసీపీ వెల్లడించారు.

సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తాం..

జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించనున్నట్లు డీసీపీ కిరణ్ ఖరే తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత సెక్టార్ల ఎస్‌ఐలు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి నివేదిక అందజేస్తారని చెప్పారు. ప్రతిరోజూ కొన్ని ప్రాంతాల్లో పర్యటించి కెమెరాల పనితీరును పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ నారాయణగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని బ్లడ్‌బ్యాంక్, రాజమొహల్లా, శాంతి థియేటర్ ఎదురు లైన్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. 11 కేవీ సీబీఐ ఫీడర్ పరిధిలోని గుజరాతి గల్లీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సాగర్ ప్లాజా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఖాజీపురా ఫీడర్ పరిధిలో..

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఖాజీపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పెండింగ్ పన్నుల చెల్లింపు


మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు చెక్కు అందజేస్తున్న మొహీనుద్దీన్

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్, కంచన్‌బాగ్‌లోని డీఎంఆర్ఎల్, డీఆర్‌డీఓకి చెందిన ఏటీసీ, దేవతలగుట్టకు సంబంధించిన ఆస్తులకు ఆస్తి పన్ను/సేవా చార్జీల పెండింగ్ బిల్లులు చెల్లించారు. 2015 నుంచి 2023 వరకు పెండింగ్‌లో ఉన్న బకాయిల మొత్తం రూ.31,54,024ల చెక్కును బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్ అండ్ డీ) కంచన్‌బాగ్ డీఎంఆర్ఎల్, డీఆర్‌డీఓ ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మొహీనుద్దీన్ అందజేశారు.

పనిచేయని సిగ్నల్స్‌తో వాహనదారుల ఇబ్బందులు

గోల్కొండ: రోడ్ల కూడళ్ల వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. మెహిదీపట్నం మేరాజ్ చౌరస్తా, టూంబ్స్ చౌరస్తా వంటి రద్దీ ప్రదేశాల్లో సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. అత్యంత రద్దీగా ఉండే మేరాజ్ చౌరస్తాలో సిగ్నల్స్ సరిగా పనిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సిగ్నల్స్‌కు మరమ్మతులు చేయాలని, కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.

డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పద్మారావు



నాంపల్లి: గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర తాత్కాలిక అధ్యక్షుడిగా ఈరవేణి పద్మారావుముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షుడు సర్దార్ మంజీత్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా చింతల్ బస్తీలోని డ్రైవర్ల కేంద్ర సంఘం కార్యాలయంలో పద్మారావుముదిరాజ్‌ను డ్రైవర్లు సత్కరించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సహాధ్యక్షుడు శ్రీపంతులు శ్రీను, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, కోశాధికారి హషీం హుస్సేన్ సాబ్, ఉపాధ్యక్షుడు అలీంభాయి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

గోల్కొండ: కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమని రోటరీ క్లబ్ ప్రతినిధి ఏకాంబర రెడ్డి అన్నారు. మంగళవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి చెందిన వైద్యులు స్క్రీనింగ్ క్యాంప్‌లో పాల్గొని కళాశాల సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు.

మిల్లెట్స్‌తో ఆరోగ్యం

మణికొండ: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బిగోనియా హోమ్స్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మిల్లెట్స్ టిఫిన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని ఈ ఏడాదిని మిల్లెట్స్ సంవత్సరంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునివ్వటంతోనే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మొత్తం 365 కేంద్రాల్లో రోజూ 365 మందికి పైగా అన్ని రకాల చిరుధాన్యాల టిఫిన్‌లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు బీరప్ప, కో- ఆప్షన్ సభ్యుడు లక్ష్మీరాములు, సీ.హెచ్ ఇందిర, శంకర్‌సింగ్, వేణుకుమార్, అనితాదేవి, వెంకటాచారి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత దేశం ప్రపంచ క్రీడా రంగంలో రాణిస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ కేసరి, దేవర కరుణాకర్ మెమోరియల్ కుస్తీ పోటీలను శనివారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు శిక్షణ ఇస్తుందన్నారు. టీంతో పాటు వ్యక్తిగత క్రీడాంశాలలో అంతర్జాతీయ వేదికలపై బంగారు పతకాలు సాధిస్తున్నారన్నారు. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ తదితర విభాగాల్లో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని ఆయన అన్నారు. దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ గొప్ప నాయకుడని కొనియాడారు. పోటీలు నిర్వహిస్తున్న బీజేపీ యువ నాయకుడు దేవర వంశీని ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్, కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్, కార్పొరేటర్ బోహిని దర్శన్, దేవర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యలకు పరిష్కారం


తన వద్దకు వచ్చిన వారి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తానెప్పుడూ పేదల పక్షానే నిలుస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకిలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వేసవిలో ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి సరఫరా విషయంపై అధికారులు సైతం సానుకూలంగా స్పందిస్తున్నారని, వేసవిలో నీటి సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని అధికారులు హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కొంతమేర ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఆయన అన్నారు. పలు ప్రాంతాల్లో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు, వరద నీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా దర్బార్‌కు వచ్చిన వృద్ధ దంపతులతో మట్లాడి వారి కుటుంబ సమస్యలను పరిష్కరించి ఎలాంటి కలహాలు లేకుండా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, జుబేర్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు


పారిశుద్ధ్య కార్మికురాలితో మాట్లాడుతున్న కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి అందజేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘సంస్కృతాన్ని మరిస్తే సంస్కృతిని మర్చినట్లే’


మధుసూదన్‌ను సత్కరిస్తున్న అతిథులు

సుల్తాన్‌బజార్: గర్వించదగిన, అత్యంత ప్రాచీనమైన మన నాగరికత, సంస్కృతులపై విదేశీయులు రాసే తప్పుడు రాతలను ఖండించడం కోసమైనా మన వాఙ్మయాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించిన సభలో వేదాలంకార ఆచార్య ముదిగంటి గోపాల్‌రెడ్డి పురస్కారాన్ని సంస్కృత విద్వాంసుడు ఆచార్య పెన్నా మధుసూదన్‌కు ప్రదానం చేశారు. రూ.25 వేల నగదు, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. సంస్కృత భాషను మర్చిపోతే మన సంస్కృతిని మర్చిపోయినట్లేనన్నారు. పాణిని లాంటి వ్యాకరణం ప్రపంచంలో మరే భాషకు లేదన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ డీజీపీ, సంస్కృత పరిశోధకుడు డాక్టర్ కె.అరవిందరావు మాట్లాడుతూ.. రాజీవ్ మల్హోత్ర ‘బ్రేకింగ్ ఇండియా’ పేరుతో రాసిన రెండు పుస్తకాలు మన దేశానికి ముఖ్యంగా పురాణ వాఙ్మయానికి వక్ర భాష్యం చేప్పేవిధంగా ఉన్నాయన్నారు. మధుసూదన్‌కు పురస్కారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.

‘పాతబస్తీకి మెట్రోపై ప్రభుత్వం వివక్ష’


మాట్లాడుతున్న కేవీఎల్ఎన్ రెడ్డి

గౌలిపురా: పాతబస్తీకి మెట్రో రైలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జి కె.వి.ఎల్.ఎస్.రెడ్డి విమర్శించారు. గౌలిపురా డివిజన్‌లోని పటేల్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద మంగళవారం శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఇ.సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగకుండా ఎంఐఎం అడ్డుకుంటుందన్నారు. గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధికి అడ్డుపడుతుందన్నారు. బస్తీల్లో మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జలమండలి అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా నిధులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జమాల్‌పూర్ చంద్రశేఖర్, గౌలీకర్ ధీరజ్‌లాల్, జి.రఘుకాంత్, డి.ప్రవీణ్ కుమార్, పి.రమేశ్‌గురుస్వామి, జమాల్‌పూర్ అశోక్, ఎ.భానుప్రకాశ్, కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. వ్యక్తికి స్వల్ప గాయాలు

మణికొండ: అతి వేగంగా వచ్చిన కారు ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ చింతచెట్టు సర్కిల్ నుంచి అలిజాపూర్ దారిలో రోడ్డును విస్తరించడంతో ఈ మధ్య కార్లను అతివేగంగా నడుపుతున్నారు. ముందు వెళ్తున్న వాహనాలను సైతం గమనించకుండా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం ఓ కారు వేగంగా వచ్చి ఒక్కసారిగా బ్రేక్ వేయటంతో డివైడర్‌కు ఢీకొని ఆగిపోయింది. మంగళవారం మరో కారు వేగంగా వచ్చి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై జనం లేకపోవటంతో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అజాగ్రత్తగా వాహనాలు నడిపే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, యాదయ్య తదితరులు

అబిడ్స్: వాటర్‌బోర్డు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్–2023 నూతన డైరీని మంత్రి కేటీఆర్, చైర్మన్ కాలె యాదయ్య ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ డైరీని రూపొందించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ శంకర్ ప్రకాష్, ప్రతినిధులు ఉదయ్‌కుమార్, బి.అశోక్, మొగులయ్య, జంగయ్య, డి.యాదగిరి, ఎం.ప్రేమ్‌కుమార్, శాలిమాన్ రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టిమ్స్ స్థలంలో రేకుల ప్రహరీ తొలగింపు

చైతన్యపురి: చైతన్యపురిలోని టిమ్స్ స్థలంలో రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన రేకుల ప్రహరీని తొలగించారు. ఒక వర్గానికి అన్యాక్రాంతం చేయాలని ఎకరానికి పైగా స్థలాన్ని వదిలేసి టిమ్స్ స్థలంలో అక్రమంగా ప్రహరీ ఏర్పాటు చేస్తున్నారని స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని వారు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, ఎల్‌బీనగర్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో టిమ్స్ స్థలాన్ని సందర్శించిన జీహెచ్ఎంసీ సిటీ ప్లానర్ ప్రసాద్ పరిశీలించి ప్రహరీని వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో రాత్రికి రాత్రే రేకుల ప్రహరీని తొలగించారు. ఒక వర్గానికి అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారని తాము చేసిన ఫిర్యాదుకు స్పందించిన జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులకు కార్పొరేటర్ నర్సింహగుప్తా కృతజ్ఞతలు తెలిపారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం కేటాయించిన స్థలంలో ఇతర నిర్మాణాలు జరిపితే ఎట్టి పరిస్థితిలో ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు.

‘నిషా’చరులకు జైలు శిక్ష

మలక్‌పేట: ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాలలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 26 మంది వాహనదారులను మంగళవారం నాంపల్లి 3వ ఎమ్ఎమ్ కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న తెలిపారు. వారిలో 22 మంది మొదటి సారి పట్టుబడగా ఒక్కొక్కరికి రూ. 2100, రెండోసారి నలుగురు పట్టుబడగా ఒక్కొక్కరికి రూ. 3300 జరిమానా విధించారు. ముగ్గురికి 6 రోజులు, ఇద్దరికి 5 రోజులు, ఒకరికి 4 రోజులు జైలు శిక్ష ఖరారు చేసిందన్నారు. ఒకరిది 18 నెలలు, మరొకరిది 8 నెలలు ఇద్దరు వాహనదారుల లైసెన్స్ సస్పెండ్ చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఆకట్టుకున్న ‘భారతీయం’



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణను స్మరిస్తూ కథక్ కళా క్షేత్ర ఆధ్వర్యంలో భారతీయం పేరిట మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య రూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, పేర్ని వంటి నృత్య ప్రదర్శనలు ఒకే వేదికపై ప్రదర్శించడంతో నృత్య ప్రియులు ఆనందం వ్యక్తం చేశారు.

హనుమాన్ మహాదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న పవన్‌కుమార్, సదానందం

అబిడ్స్: ఆగాపురా హనుమాన్ మహాదేవ్ ఆలయంలో అమావాస్య వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాఘ అమావాస్య సందర్భంగా అభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లూరి పవన్‌కుమార్, కొల్లూరి సదానందంతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

అబిడ్స్: ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద దాదాపు 600 మంది రోగుల సహాయకులకు అస్గద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా హుస్సేని మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సహాయకులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో కేఆర్ రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, శ్రీధర్, వైదిక్ శాస్త్రి, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, మహ్మద్ వహీద్, కృష్ణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ముజీబ్ హుస్సేని

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: కంటి సమస్యలు ఉన్న వారు ‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కౌన్సిలర్ హైమాంజలిఅనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం తన వార్డు పరిధిలోని ల్యాంకోహిల్స్‌లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత దెబ్బతినటంతోనే అనేక మందికి కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. వాటికి సకాలంలో పరీక్షలు నిర్వహించుకుని నయం చేసుకోవాలని సూచించారు. ల్యాంకోహిల్స్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు అర్జున్, సంయుక్త కార్యదర్శి కిషోర్, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో బీఆర్ఎస్ నాయకులు

గోల్కొండ: మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇప్పటికే వారి కోసం వేలాది కోట్ల రూపాయలు కేటాయించిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ మంత్రిని కలిశారు. మైనార్టీలకు సబ్సిడీ లోన్ స్కీం కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మహ్మద్ నయీముద్దీన్, మౌలానా, మహ్మద్ నసీముద్దీన్, సయ్యద్ నసీబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ గెలుపు ఖాయం


మజ్లిస్ ఎమ్మెల్యేలతో ఎమ్మెల్సీ అభ్యర్థి మీర్జా అహ్మద్ బేగ్

గోల్కొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థి మీర్జా అహ్మద్ బేగ్ గెలవడం ఖాయమని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మజ్లిస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైన మీర్జా అహ్మద్ బేగ్ మంగళవారం ఆ పార్టీ ఎమ్మెల్యేలను కలిశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, అహ్మద్‌పాషా ఖాద్రి, కౌసర్ మొహియుద్దీన్, బలాలా, ఎమ్మెల్సీ హసన్ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మర్చిపోకూడదు

చార్మినార్: ప్రతి ఒక్కరూ మాతృభాష నేర్చుకోవాలని అంజుమన్–ఇ–తర్రాకీ ఓ బకా ఉర్దూ అధ్యక్షుడు ఎజాజ్ అలీ ఖురేషి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని యాకుత్‌పురా ఖురేషి లేన్‌లో మంగళవారం సెమినార్, ముషాహిరా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మాతృభాషను మర్చిపోతే అన్నీ కోల్పోయినట్లే అన్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఖరీం ఖాన్, మహ్మద్ జహీర్, అబ్దుల్ సమీర్, మహ్మద్ అబ్దుల్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు

గౌలిపురా: పాతబస్తీలోని ఇరువర్గాల ప్రజలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పోస్టు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని జితేందర్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మొఘల్‌పురా పోలీసులు తెలిపారు. శాలిబండ ప్రాంతంలో కాశీ విశ్వనాథ దేవాలయం గురించి పొన్న వెంకటరమణ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, రెండు వర్గాల మధ్య సఖ్యత దెబ్బతినే విధంగా ఉన్నందున కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా మచిలేశ్వరస్వామి రథోత్సవం

మణికొండ: మంచిరేవుల మచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామి వారిని రథంపై దేవాలయం నుంచి గ్రామం వరకు ఊరేగింపుగా గ్రామస్తులంతా కలిసి తీసుకొచ్చారు. అనంతరం వారు తమ ఇంటికి ముందుకు వచ్చిన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం తెల్లవారు జామున రథోత్సవం, మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ దేవాలయ వంశ పారపర్య ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.


దేవాలయం నుంచి మంచిరేవుల గ్రామానికి వస్తున్న రథం